# కా ఫీ రా గా లు

బ్రిటిష్‌వాడు మనకు వదిలిపెట్టిన వారసత్వపు అలవాట్లలో కాఫీ ఒకటి. బిచ్చమెత్తుకునేవాడి దగ్గరనుండి మిలియనీరు వరకు తెల్లవారితే కాఫీ త్రాగకుండా ఉండలేడు.

కాని మా సెక్షన్లో, తుమ్మితే, దగ్గితే కాఫీ త్రాగే అలవాటుంది.

మా సెక్షన్లో అందరం తలవంచుకుని పనిచేస్తున్నాం. ఈ లోపుగా అటెండరు కాఫీలు పట్టుకువచ్చాడు. అందరం త్రాగుతున్నాం.

మా సెక్షన్లో ఒక దురాచారం ఉంది లెండి ఎవరైనా క్రొత్తచెప్పులు కుట్టించుకున్నా, క్రొత్త వస్తువులు ఏవైనా కొన్నాసరే, సర్వీసులో ఇంక్రిమెంట్లు వచ్చినా, ఏదైనా అనుకోకుండా లాభం వచ్చినా, ఆ లాభం పొందిన ఆడిటర్ సెక్షన్‌లో అందరికి కాఫీలు తెప్పించాలి. సరే ఈ విధంగా కాఫీలు ఎవరు తెప్పించారు? అన్నది ప్రశ్న.

నేను సెక్షన్‌లో అందరినీ పరిశీలించాను. ఎవరికి అటువంటి విశేషం జరిగినట్లుగా దాఖలాలేదు. సూపర్నెంటుగారు తలవంచుకుని పని చేసుకుంటున్నారు.

సెక్షన్‌లో అందరికన్నా సరదాగా ఉండే సుబ్బారావుగార్ని 'ఏమండీ కాఫీలు ఎవరు తెప్పించారు?' అని అడిగేను. "ఏమో తెలియదండి" అన్నాడాయన. ఆశ్చర్యపోవటం నా వంతు అయింది. మా సెక్షనులో కంట్రాక్టరు బిల్లులు లేవు. పోనీ ఎవరైనా కంట్రాక్టరు తెప్పించాడు అనుకుందామంటే. ఈలోగా మా అటెండర్

"ఏం సార్ మీ పేజీ నెంబరు ఎంత కాఫీలు ఖర్చు వ్రాస్తాను మీ కాతాలో" అంటున్నాడు సుబ్బారావుగారితో.

"కాఫీలు తెమ్మని నీ కెవడు చెప్పాడోయ్! బలే బాగుంది, నాకు శనిగాడు నెత్తిమీద ఉన్నాడు. నాకేం మంచి జరుగుతుంది" అని వాపో యాడు సుబ్బారావు.

"అదేంటిసార్ ఇందాక పైపు సెక్షన్‌లో కాగితాలు ఇచ్చేసి పది హేను కాఫీలు తీసుకురమ్మని చెప్పారు కదా" అన్నాడు.

టైపు చేయటానికి కాగితాలు పదిహేను కాపీలు అనిచెప్తే 15 కాపీలు పట్టుకువచ్చావా. మా ప్రాణానికి నువ్వొకడివు తోడయ్యావు" తల పట్టుకుని కుర్చీలో కూలబడ్డాడు. గొల్లున నవ్వడం మా వంతయ్యింది.

కాపీలు తెప్పించటంలో మోసం జరుగుతున్నట్లు అనుమానం వచ్చింది. ఎందుకంటే క్రొత్త బట్టలు వేసుకున్నవాళ్లు అవి బాగా నలిగితేగాని సెక్షన్‌కు వేసుకురావడంలేదు, ఇలాగే మిగతా వాటికి ఉపాయం కనిపెట్టారు. సర్వీస్ మేటర్స్ ఏలాగూ తెలుస్తుంది కదా.

నేను ఈ కాపీలు ఇవ్వకుండా ఎగ్గొట్టే అవకాశం ఉండకుండా ఒక మార్గం కనిపెట్టాను.

ఆ తీర్మానం మా సెక్షన్‌లో లీజర్ టైములో ప్రవేశపెట్టాను.

సర్వీస్ మేటర్స్‌లో బెనిఫిట్ వస్తే తప్పకుండా అందరూ కాఫీలు ఇస్తున్నారు. కాని ఏమయినా క్రొత్త వస్తువులుకొంటే కాపీలు తెప్పించటంలేదు. ఇది చాలా విచారంతో గుర్తింపదగినది. అందువల్ల క్రొత్తవస్తువు కొన్నవాళ్ళు అది చూపించి "C.R కాఫీ రిసీవ్డ్" అని ముద్ర వేయించుకోవాలి. లేనిచో కాఫీ క్లబ్‌నుండి శాశ్వతంగా బహిష్కరించబడుదురు."

అందరూ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించారు.

మర్నాడు మా సెక్షన్‌లో సీనియర్ క్లర్క్ ఖద్దరు చొక్కా క్రొత్తది వేసుకుని వచ్చేడు. అందరూ ఒకటే గుసగుసలు క్రొత్త చొక్కాకు కాఫీలు ఎప్పుడు వస్తాయని సుబ్బారావు కదిలించాడు.

శాస్త్రిగారూ ఏవో విశేషంలా కనపడుతూంది. C. R. ముద్ర వేయించుకున్నారా?

"చాల్లేవయ్యా ఖద్దరు మీటరు ఏడు రూపాయలు. కుట్టుకూలి కలిపి మొత్తం పదిరూపాయలు అయింది. మీకు కాఫీలకు మూడు రూపాయలు ఖర్చుపెట్టాలా, అన్యాయం ఆక్రోశించాడా పెద్దమనిషి.

"అయినా తప్పదండీ రూలంటే రూలే. మొన్న చలపతి మూడు

రూపాయలు పెట్టి బాల్‌పెన్నుకొని కాపీలు తెప్పించలేదూ'' ఇటువంటివి రికార్డు చేసుకోవడంలో మా సుబ్బారావు ఘనుడు.

నేను కాపీలు తెప్పించనండి, మీరు యేమయినా చేసుకోండి. పదిరూపాయల చొక్కాకి మూడు రూపాయలు క్షవరమా?''

ఇంక మేము చేసేదేముంది? పూర్తిగా క్రమశిక్షణ చర్యకు కూడా లెక్కచేయని రాజకీయ నాయకుడిలా ఆయన మాట్లాడేడు. అందరం నోళ్ళు మూసుకున్నాము. దానితో మా సెక్షన్‌లో అనాదిగా వస్తున్న "కాఫీలు తెప్పించటం'' అనే ఆచారం రద్దు అయింది.

—o—

## ఎదురు తిరిగిన 'కాకా'

దేనికైనా సమయం సందర్భం వుండాలి అంటారు పెద్దలు, "కానీ అంతా మన తెలివితేటలమీద ఆధారపడివుంటుంది'' అంటాడు మా ఆఫీసులో కొత్తగా చేరిన సుబ్బారావు.

ఆ రోజు మా ఆఫీసులో చాలా సందడిగా వుంది. కారణం ప్రమోషన్లకోసం లిస్టులు పంపమని హెడ్ ఆఫీసునుంచి ఫోన్‌వచ్చింది. ప్రమోషన్లు కావాలంటే ఎలాగోలాగ తంటాలుపడి తనపేరు అందులో ఎక్కించుకునేలా చెస్తేసరి అనుకుంటున్నాడు సుబ్బారావు.

"మన బాస్‌తో ప్రమోషన్ లిస్టు విషయం నేనువెళ్ళి చెప్పుకోనా'' అన్నాడు సుబ్బారావు ఆపీసు టైపిస్టుతో. టైపిస్టు ఇంటర్నేషనల్ లెవల్లో ఫోజుపెట్టి "మన బాస్ మూడ్ కనిపెట్టి వెళ్ళాలయ్యా! ఎందుకయినామంచిది బాస్‌దగ్గర అటెండర్ బాలయ్యని అడిగిచూడు'' అన్నాడు.

దానికి సుబ్బారావు మండిపడి "బాలయ్యలేడు గీలయ్యలేడు. నేను ఎంతటివాడినయినా బుట్టలో పడెయ్యగలను. నువ్వే చూస్తావుగా''అన్నాడు.

"ఆమాత్రందానికి నన్నెందుకు గురూ అడిగావు? గో. ఎ. హెడ్. విష్ యూ గుడ్‌లక్'' అన్నాడు టైపిస్టు.

మర్నాడు ఆఫీసులో—

ఉరిశిక్షవేసిన ఖైదీని "అబ్బాయి కొన్ని క్షణాలలో నువ్వు చచ్చిపోతావు కదా నీ ఆఖరి కోరిక ఏమిటి!'' అని ఉరికంబం దగ్గర అడిగే